నీలకంఠ నివాసంలో సౌకర్యాలు

- ఎంపీ నిధులతో పెద్దవడుగూరు శ్మశాన వాటిక అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



శ్మశాన వాటికలో ఎంపీ నిధులతో నిర్మించిన భవనం



దహన సంస్కారాలకు ఏర్పాటు చేసిన షెడ్

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని శ్మశాన వాటికకు సకల సౌకర్యాలు సమకూరాయి. దీంతో ప్రజలు ప్రభుత్వ పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలం కేంద్రంలో దాదాపు 10 వేలకు పైగా జనాభా ఉంది. ఏళ్ల తరబడి మండలకేంద్రంలోని ప్రజలు శ్మశాన వాటికలో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. కంపచెట్లతో నిండిన శ్మశాన వాటికకు వెళ్లాలంటేనే జంకే పరిస్థితి ఉండేది. ఇక నీటి సౌకర్యం సరేసరి. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా తమ ఇబ్బందులు మాత్రం మారడం లేదని ప్రజలు ఆవేదన చెందేవారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం శ్మశాన వాటిక సమస్యను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు శ్మశాన వాటిక అభివృద్ధి పనులపై అంచనాలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రూ.37.3 లక్షలతో అభివృద్ధి పనులు

ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి శ్మశాన వాటికి అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎంపీ నిధులు, ఉపాధిహామీ నిధులు రూ.37.3 లక్షలతో శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు చేపట్టారు. శ్మశాన వాటికకు ప్రధాన రహదారి వెంట ప్రహరీ ఏర్పాటు చేశారు. అంత్యక్రియల్లో పాల్గొన్న వారు స్నానం చేయడానికి దుస్తులు మార్చుకోవడానికి రెండు గదులు నిర్మించారు. నీటి సౌకర్యం కోసం మినీ ట్యాంకు ఏర్పాటు చేశారు. అలాగే దహన సంస్కారాల కోసం ఫ్లాట్‌ఫాం నిర్మించారు. శ్మశానంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడంపై మండల ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఎన్నడూ లేని విధంగా శ్మశాన వాటిక అభివృద్ధి



గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్మశాన వాటికి అభివృద్ధి చేసింది. గతంలో పెద్దవడుగూరులోని శ్మశాన వాటికలో కంపచెట్లు తొలగించి చేతులు దులుపుకునే వారినే చూశాం. కాని ఇప్పుడు వాటికను అభివృద్ధి పర్చడంతోపాటు సౌకర్యాలు ఏర్పాటు చేయడం హర్షణీయం.

రామాంజినేయులు, పెద్దవడుగూరు

అన్ని సౌకర్యాలు



శ్మశాన వాటిక గతంలో కంపచెట్లతో నిండి ఉండేది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రభుత్వాలు మారినా పట్టించుకునే వారు కరువయ్యారు. అయితే మొదటి సారిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్మశాన వాటికలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసింది.

– ప్రసాద్‌రెడ్డి, పెద్దవడుగూరు

ఘనంగా బలిజల కార్తీక వనభోజనం



గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న బలిజలు

గుత్తి: స్థానిక తాడిపత్రి రోడ్డులో ఉన్న జేజే కాలనీలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయ బలిజ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బలిజల కార్తీక వన భోజన కార్యక్రమం ఘనంగా జరిగింది. సంఘం గౌరవాధ్యక్షుడు పీవీ రమణ, రాయలసీమ అధ్యక్షుడు పాములాయి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, అనంతపురం టౌన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళి రాయల్, జిల్లా, నియోజకవర్గం నాయకులు మణికంఠ, రమేష్, పావురాల శేఖర్, రవీంద్ర,మార్కెట్ శ్రీధర్, ఆముదాల గిరిధర్, పగడాల శ్రీనివాసులు, బాలరాజు రాయల్ విశ్వనాథ్, సుబ్బు, నాగరంగప్రసాద్ హాజరయ్యారు. మొదట రాయల్ సర్కిల్‌లోని శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకృష్ణ దేవరాయ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఉంచి రాయల్ సర్కిల్ వద్ద నుంచి జేజే కాలనీ వరకు మేళ తాళాలతో ఊరేగింపు(ర్యాలీ) నిర్వహించారు. ఉసిరి చెట్టుకు పూజ చేశారు. అనంతరం జేజే కాలనీలో జరిగిన సభలో అతిథులు మాట్లాడుతూ బలిజలు రాజ్యాధికారం సాధించాలన్నారు. అనంతరం గుత్తి బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు పీవీ రమణ, అధ్యక్ష, ఉపాధ్యక్షులు మారాకుల రమణ, శ్రీకరం గోవిందరాజులు, రమేష్ బాబు, ఆముదాల గిరిధర్ మాట్లాడారు. బలిజలందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల మంది బలిజ కులస్తులు ఉన్నారన్నారు. బలిజ సంఘం మండల అధ్యక్షుడు రమణ, కార్యదర్శి రాము, మాజీ ఉపాధ్యక్షులు రమేష్ బాబు, కోశాధికారి మంజు, ఈసీ సభ్యులు గండికోట రఘు, నాని రాయల్, శ్రీకరం వెంకటేష్, నాగరాజు, విశ్వ మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలరించిన చిన్నారుల నాట్య ప్రదర్శన: ఈ సందర్భంగా చిన్నారులు పుష్పాంజలి నాట్య ప్రదర్శన చేసి అందరినీ అలరించారు. చిన్నారులకు గుంతకల్లు రైల్వే ఉద్యోగి రవీంద్ర రూ. 5 వేలు నగదు బహుమతి అందజేశారు. గుత్తి ఆర్ఎస్ కు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పీవీ రమణ బలిజ కళ్యాణ మండప నిర్మాణానికి 50 సెంట్ల విలువైన స్థలాన్ని విరాళంగా ప్రకటించారు. దీంతో పీవీ రమణ, లక్ష్మీదేవి దంపతులను బలిజ సంఘం నాయకులు శాలువాలు , పూల మాలలతో సత్కరించారు. పీవీ రమణ, ఆముదాల గిరిధర్, అప్పా రామన్న, కందుల హేమలత,పచ్చావల కృష్ణమోహన్ రూ.లక్ష చొప్పున, కుప్రాళ్ల కోటేశ్వరరావు రూ.50 వేలు విరాళం ప్రకటించారు.

జగనన్న మళ్లీ సీఎం కావడం తథ్యం



గార్లదిన్నెలో బసవరావు పాదయాత్ర మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పామిడి: జగనన్న మళ్లీ సీఎం కావడం తథ్యమని ఏపీ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు, పాదయాత్రికుడు కట్టెపోగు బసవరావు పేర్కొన్నారు. గత నెల 17న వై నాట్ 175కు మద్దతుగా ఇడుపులపాయ నుంచి ఇచ్చాపురం వరకూ బసవరావు చేపట్టిన పాదయాత్ర శనివారం రాత్రి పామిడికి చేరుకున్న విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం బీసీసీ రోడ్డు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అనంతపురం వైపు పాదయాత్రగా బయలుదేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆయనకు మద్దతుగా గార్లదిన్నె మండల సరిహద్దు వరకూ పాదయాత్ర చేశారు. అంతకు ముందు పామిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కట్టెపోగు బసవరావు బృందాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 రోజుల్లో 2 వేల కి.మీల పాదయాత్ర చేస్తామన్నారు. పాదయాత్రకు అడుగడుగునా భారీ స్పందన లభిస్తోందన్నారు. ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, వైస్ కన్వీనర్ శివారెడ్డి, బీసీ సెల్ పట్టణ కన్వీనర్ చీమల నగేష్, పట్టణ, రూరల్ బూత్ కన్వీనర్లు వెంకటగుప్తా, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి బెల్లాల రమణారెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు బీకే అన్వర్‌బాషా, కే మహబూబ్‌బాషా, అబుసాలేహా, షెక్షావలి, చాకలి సుంకన్న, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకుందామని రాష్ట్ర మాజీ కమిషన్ ఎస్సీ సభ్యుడు బసవరావు పేర్కొన్నారు. బసవరావు చేపట్టిన పాదయాత్ర ఆదివారం మండలంలోకి ప్రవేశించింది. ఈసందర్భంగా ఎంపీపీ వెంకటనారాయణ, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, నాయకులు బసవరావు పాదయాత్రకు మద్దతు తెలిపారు.గార్లదిన్నె బస్టాండ్ సర్కిల్లో ఉన్న దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులార్పించారు. జంబులదిన్నె సొసైటీ డైరెక్టర్లు వెంకటశివారెడ్డి, ఈశ్వరయ్య,తాతిరెడ్డి, బీఎస్ రామాంజనేయులు, రామాంజనేయులు, శంకర్‌రెడ్డి, బూదేడు సర్పంచు శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన అశ్వత్థం



అశ్వత్థ నారాయణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దపప్పూరు: కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా చిన్నపప్పూరులో వెలిసిన అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు పెన్నానది లో పుణ్యస్నానాలు ఆచరించి నారాయణస్వామి, శ్రీచక్ర భీమలింగేశ్వర స్వామి చుట్టూ తడి దుస్తులతో ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వాములకు ముడుపులు, కానుకలతో పాటు తల నీలాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం సదుపాయాలు కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుధీర్ కుమార్ శర్మ, బాల సుబ్రమణ్యం శర్మ భక్తులకు ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

చెక్క భజన గురువుకు జాతీయ పురస్కారం



విజయవాడలో చెక్క భజన గురువును సన్మానిస్తున్న సాహితీ వేదిక సభ్యులు

గుత్తి రూరల్: లచ్చానుపల్లి గ్రామానికి చెందిన ఎస్.చిన్న జమాల్‌వలి అనే వ్యక్తికి చెక్క భజనలో రాణిస్తున్నందుకు తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం-2023 లభించింది. విజయవాడకు చెందిన జాతీయ స్వచ్ఛంద సంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక చిన్న జమాల్‌వలికి ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విశిష్ట పురస్కారాన్ని అందించింది. లచ్చానుపల్లికి చెందిన చిన్న జమాల్‌వలి కొన్నేళ్లుగా చెక్క భజన రంగంలో శిక్షకుడిగా ఉన్నారు. చెక్క భజనలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి శ్రీ కృష్ణదేవ రాయ కళావేదిక, విశ్వకర్మ గాయిత్రి నాట్య కళావేదిక ఆధ్వర్యంలో చిన్న జమాల్ వలిని శాలువాతో సత్కరించి, సన్మాన పత్రం, నంది అందజేశారు. ఈ సందర్భంగా జమాల్‌వలి మాట్లాడుతూ చెక్క భజన అంశంలో ఇప్పటి వరకూ 300 మందికి పైగా శిక్షణ ఇచ్చానన్నారు. పురస్కారం మరింత బాధ్యత పెంచిందని తన ఊపిరి ఉన్నంత వరకూ చెక్క భజనలో యువతీ, యువకులకు శిక్షణ ఇస్తానని జమాల్‌వలి తెలిపారు.

ఘర్షణలో ముగ్గురికి తీవ్రగాయాలు





గాయపడిన ఫకృద్దీన్, బానుబీ

తాడిపత్రిటౌన్: తోట దారి కోసం ఆదివారం జరిగిన ఘర్షణలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. నందలపాడు కు చెందిన ఫకృద్దీన్, నాగలింగయ్యకు పెన్నానది ఒడ్డున పక్కపక్కనే మామిడి, జామ, సపోట తోటలు వున్నాయి. పొలాల గట్లు, తోటలకు వెళ్లే దారి విషయమై ఇరు కుటుంబాల మధ్య గొడవకు దారి తీసింది. నాగలింగయ్య , తన కొడుకు నాగేంద్రతో పాటు మరో ఇద్దరు కలిసి ఫకృద్దీన్, అతని భార్య భానుబీతోపాటు కొడుకు నబీషాపై దాడి చేసి గాయపరిచారు. ఫకృద్దీన్ తలకు గాయాలు కాగా భానుబీకి చెయ్యి విరిగింది. నబీషాకు ఛాతిపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు.



పూజలందుకున్న సింగరప్ప దేవతామూర్తులు



పామిడిలో భజన మండలి సంకీర్తనాలాపన

ఘనంగా కార్తీకమాస పూజలు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయం, పెన్నానది బడ్డున గల క్షేత్రపాల సింగరప్ప ఆలయాల్లో ఆదివారం కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లోని దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. డబ్బే, రంగసుభే ఫిర్కా భజన మండళ్ల ఆధ్వర్యంలో పామిడి, సింగరప్ప కొండపై ప్రత్యేక భజనలు నిర్వహించారు. అనంతరం సింగరప్ప కొండపై వనభోజనాలు చేశారు.

ఘనంగా అయ్యప్ప మండల పూజ



రథంపై కొలువుదీరిన అయ్యప్ప స్వామి



దేవతల వేషధారణలో భక్తులు

గుంతకల్లు: పట్టణంలో అయ్యప్ప మాలధారుల మండల పూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని డీఆర్ఎం కార్యాలయం సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఉదయం నుంచి స్వామికి పూజ చేపట్టారు. సాయంత్రం అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువుదీర్చి వేదపండితులు, అర్చకులు వేద మంత్రోచ్చారణలు, మేళతాళలతో, భజనలతో ఊరేగించారు. పాత గుంతకల్లులోని శివాలయం నుంచి ప్రధాన రహదారి, కసాపురంరోడ్డు, రామస్వామి గుడి వీధి, స్టేషన్ రోడ్డు మీదుగా డీఆర్ఎం కార్యాలయం సమీపంలోని అయ్యప్ప ఆలయం వరకు ఊరేగింపు సాగింది. చిన్నారులు దేవతల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్త మండలి సభ్యులు, మాలధారులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

తాడిపత్రి అర్బన్: పార్టీలు, కులమతాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలను కోరారు. ఆదివారం పట్టణంలోని 7, 8వ వార్డుల్లో నాయకులు డీవీ కుమార్, అయూబ్‌బాషా తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. టీడీపీ హయాంలో కేవలం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు. కానీ జగనన్న పాలనలో అర్హతే ఉంటే ఇంటి వద్దే పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గడమాన్ షఫీ, సాయికృష్ణ, షాకీర్‌బాషా, ఓబులేసు, ఎస్ అయూబ్, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండె వైద్య శిబిరం



రోగులను పరీక్షస్తున్న డాక్టర్ రామ్‌కుమార్

యల్లనూరు: తిరుమలాపురం పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సర్పంచు అజ్జుగుట్టు రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గుండె వైద్య నిపుణుడు రామ్‌కుమార్ 85 మంది రోగులకు పరీక్షలు చేసి ఐదుగురిని శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబరు నిర్మల, ఫీల్డ్ అసిస్టెంటు రామసుబ్బారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి



సుదర్శన్ శర్మ మృతదేహం

కడప అర్బన్: నగరంలోని పాతబస్టాండ్ సమీపంలో ఓ లాడ్జిలో అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..అనంతపురం జిల్లా గుంతకల్లులోని తిలక్‌నగర్‌కు చెందిన డి. సుదర్శన్ శర్మ (42) పనిపై ఈనెల 8న కడపకు వచ్చాడు. ఈ క్రమంలో పాతబస్టాండ్ సమీపంలో ఓ లాడ్జిలో దిగాడు. ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు గుర్తించారు. అతని బంధువులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగస్వామి తెలిపారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

గుంతకల్లు: స్థానిక బీసీ హాస్టల్‌లో ఆదివారం జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మానవ హక్కులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ నాగమణి, జాతీయ పరిరక్షణ సమితి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి




కరపత్రాలు విడుదల చేస్తున్న దివ్యాంగులు

గార్లదిన్నె: ఈనెల 21న అనంతపురంలోని ఎస్‌జీఓ హోంలో జరిగే దివ్యాంగుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా దివ్యాంగుల సంఘం మహిళ అధ్యక్షురాలు స్వతంత్రకుమారి కోరారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. బ్యాంకుల్లో ఎటువంటి సూరిటీ లేకుండా రూ.5 లక్షలు రుణం అందజేయలన్నారు. కార్యక్రమంలో సంఘం గార్లదిన్నె మండలాధ్యక్షుడు నాగభూషణ, నేతలు హరి, అనురాధ, శివమ్మ,వెంకటకుమార్ రెడ్డి ,కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణోత్సవం

శింగనమల: స్థానిక శివాలయంలో ఆదివారం శివమాలధారులు శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో శివపార్వతుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణం జరిపించారు. ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో గొరవయ్యలు చేసిన నృత్యం అలరించింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గిరప్ప పోరాటాలు మరువలేనివి



సంతాప సభ నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: పేదల కోసం కామ్రేడ్ గిరప్ప చేసిన పోరాటాలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. కనంపల్లిలో ఆదివారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గిరప్ప సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కిష్ట మాట్లాడుతూ గిరప్ప 22 ఏళ్లుగా కమ్యూనిస్టు పార్టీలో నిర్విరామంగా పోరాటాలు చేశారన్నారు. ఆయన గత నెల 21న గుండెపోటుతో మరణించారన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు వీరనారప్ప, చంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెద్దపప్పూరు: ముచ్చుకోట, వరదాయపల్లిలో సోమవారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటించనున్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం

గార్లదిన్నె: యర్రగుంట్లలో ఆదివారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరువు నేపథ్యంలో ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించాలన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, భూమి పంపిణీ చేయాలని కోరారు. నాయకులు నారాయణ రెడ్డి, సుబ్బన్న, సుబ్బన్న, శ్రీలక్ష్మి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పసులూరులో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట

శింగనమల: బుక్కరాయసముద్రం మండలం పసులూరు ఎస్సీ కాలనీలో ఆదివారం పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. గ్రామంలో 50 సంవత్సరాల క్రితం నిర్మించిన పెద్దమ్మ గుడి శిథిలావస్థకు చేరుకోవడంతో, దాతల సాయంతో నూతన దేవాలయం నిర్మించారు. పెద్దమ్మ విగ్రహాన్ని ఉదయం శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజలు చేశారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

గుంతకల్లుటౌన్: పట్టణంలో మూతపడిన పరిశ్రమల స్థానంలో ప్రత్యామ్నాయ పరిశ్రమలను నెలకొల్పి స్థానిక నిరుద్యోగ యువతీ,యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి దాసరి చరణ్ ప్రభుత్వాన్ని కోరారు. మూతపడిన పరిశ్రమలను పునఃప్రారంభించాలని కోరుతూ ఆదివారం డీవైఎఫ్ఐ నాయకులు మున్సిపల్ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. స్కిల్ స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, రైల్వేజోన్‌ను గుంతకల్లులో ఏర్పాటు చేయాలన్నారు. డీవైఎఫ్ఐ అధ్యక్షుడు ప్రతాప్, నాయకులు సురేంద్ర, సునీల్, చందూ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

గార్లదిన్నె: పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ప్రధాన అర్చకుడు రామాచార్యులు సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డి, ఈఓ బాబు భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కౌలు రైతు ఆత్మహత్య



నీలకంఠరెడ్డి (ఫైల్)

గార్లదిన్నె: యర్రగుంట్లలో ఆదివారం ఓ కౌలు రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన నీలకంఠరెడ్డి(35) అనే కౌలు రైతు గ్రామంలో రెండెకరాలుతో పాటు కొంత భూమిని కౌలుకు తీసుకొని వరి, కాయగూరలు సాగు చేసేవాడు. దీంతోపాటు పెట్రోల్ బంకులో పని చేసేవాడు. పంటల పెట్టుబడి కోసం ఇతర వ్యక్తుల వద్ద దాదాపు రూ.8 లక్షలు అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమారులున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు జమేదార్ సూర్యనారాయణ తెలిపారు.